ఇంటింటి సర్వే చేయాలి

కొడంగల్, సెప్టెంబరు 23: బీఎల్‌వోలు డోర్ టు డోర్ సర్వే నిర్వహించి ఓటరు జాబితాలో సవరణలు చేయాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవడం, మృతి చెందిన, శాశ్వతంగా గ్రామాలను వదిలి వెళ్లిన వారి పేర్లను జాబితాలో నుంచి తొలగించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

మత్తడి దూకిన కోట్‌పల్లి



కోట్‌పల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో మత్తడి దూకింది. ఆదివారం రాత్రి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి ప్రాజెక్టులోకి వరద నీరు రావడంతో అలుగు పోటెత్తింది. సోమవారం ఉదయం11 గంటల వరకూ రుద్రారం-నాగసమందర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. - ధారూరు, సెప్టెంబరు 23

మాయాజాలం!

ఔటర్ భూమిలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు

మమ్ములను అడిగేవారెవరు.. మేం ఏదీచేస్తే అదే కరెక్టు.. అనుకున్నారేమో తెలియదుగానీ... వారు ఏం చేయాలనుకున్నారో అదే చేశారు. అనుమతి ఇవ్వాల్సిన స్థలం ఎక్కడో ఉంటే మరోచోట స్థల పరిశీలన జరిపి తంతు ముగించారు. గతంలో ఆ స్థలం హెచ్‌ఎండీఏకు చెందినదిగా గుర్తించి 2022 జనవరిలో ఇక్కడ అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఇటీవల ఘట్‌కేసర్ రెవెన్యూలోని సర్వేనెంబర్ 581లోని ఔటర్ స్థలంలో అక్రమ నిర్మాణానికి సంబంధించి అనుమతి జారీ విషయంలో అధికారులు యథేచ్ఛగా నిబంధనలు అతిక్రమించారు. ఔటర్ రింగ్‌రోడ్డు, జంక్షన్ నిర్మాణానికి హెచ్‌ఎండీఏ సంస్థ రూ. కోట్ల రూపాయలు వెచ్చించి సేకరించిన భూమిలో అదే సంస్థ అక్రమ నిర్మాణాలకు అనుమతులు జారీ చేసింది.



ఔటర్ జంక్షన్ కోసం సేకరించిన స్థలంలో నిర్మాణం



హెచ్‌ఎండీఏ అనుమతి జారీ చేసిన నిర్మాణంలో ఉన్న ఔటర్ హద్దురాయి

- ✦ రింగురోడ్డు స్థలంలో యథేచ్ఛగా భవనాలు
- ✦ గతంలో కూల్చివేసి.. మళ్లీ అనుమతులు
- ✦ జాగా ఒకచోట.. అనుమతి మరోచోట
- ✦ రూ. కోట్ల విలువైన హెచ్‌ఎండీఏ స్థలం పరాధీనం
- ✦ ఘట్‌కేసర్‌లో హెచ్‌ఎండీఏ అధికారుల నిర్వాకం

ఘట్‌కేసర్, సెప్టెంబరు 23 : ఔటర్ రింగ్‌రోడ్డు, జంక్షన్ కోసం హెచ్‌ఎండీఏ సంస్థ కోట్ల రూపాయాలు వెచ్చించి సేకరించిన భూమికి ఆదే సంస్థ అక్రమ నిర్మాణాలకు అనుమతులు జారీ చేసింది. కేవలం 19రోజుల వ్యవధిలోనే పూర్తి అనుమతులు జారీ కావడంపై అధికారుల అత్యుత్సాహం తెటతెల్లమైంది. స్థల పరిశీలనకు వచ్చిన జూనియర్ ప్లానింగ్ అధికారి జాగ దిశలను సైతం మార్చేశాడు. స్థల పరిశీలన సమయంలో సదరు అధికారి స్థలం యొక్క నాలుగు వైపుల (తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణ భాగాలు) ఫొటోలు తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో పాటు సరిహద్దులను పరిశీలించాలి. కానీ ఈవేవి పరిగణలోకి తీసుకోకుండా దరఖాస్తుదారుడు చేసుకున్న అభ్యర్థన మేరకు సర్వేనెంబర్ 581/బి ప్లాట్ నెంబర్లు 2, 3లలో నిర్మాణ అనుమతులకు సంబంధించి తూతుమంత్రంగా పరిశీలన జరిపారు. ఇట్టి ప్లాట్లకు చాలా దూరంలో ఉన శ్రీదండ్లగడ్డ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయానికి అనుకొని ఉన్న ఖాళీ స్థలాన్ని ఉద్దేశ్యపూర్వకంగా స్థల పరిశీలన జరిపి అదే స్థలం ఫొటోలను టీఎస్‌బీపాస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం శోచనీయం. అప్‌లోడ్ చేసిన ఫొటోలోన్నూ శివారెడ్డిగూడెంలోని దేవాలయం స్పష్టంగా కనిపిస్తుంది. వేరే చోట స్థలపరిశీలన చేయడానికి ప్రధాన కారణం దరఖాస్తుదారుడు అభ్యర్థించిన స్థలం అవుటర్ రింగ్‌రోడ్డు, జంక్షన్ కోసం సేకరించిన స్థలం అయిఉండటమే. అప్పటికే హెచ్‌ఎండీఏ అధికారులు కూల్చివేసిన శిథిలాలు దర్శనమిస్తున్నాయి. ఘట్‌కేసర్ రెవెన్యూలోని సర్వేనేంబర్ 581లోని 2,330 చదరపు గజాల స్థలం పరాధీనం అధికారుల కనుసన్నల్లోనే జరిగిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

గతంలో కూల్చివేతలు

గతంలో ఆ స్థలం హెచ్‌ఎండీఏదని గుర్తించి 2022 జనవరిలో ఇక్కడ కట్టిన నిర్మాణాలను కూల్చివేశారు. ఇటీవల ఘట్‌కేసర్ రెవెన్యూలోని సర్వేనేంబర్ 581లోని 2,330 చదరపు గజాల స్థలంలో నిర్మాణానికి సంబంధించి అనుమతి జారీ విషయంలో సంబంధిత హెచ్‌ఎండీఏ అధికారులు పూర్తిగా నిబంధనలు అతిక్రమించారు. ఈ అనుమతుల జారీ విషయంలో హెచ్‌ఎండీఏలో ఇటీవల అవినీతి ఆరోపణ కేసులో పట్టుబడ్డ ప్రధానాధికారి తోపాటు మరికొందరు ఉన్నారు. హెచ్‌ఎండీఏ ఔటర్, జంక్షన్ నిర్మాణం కోసం సేకరించిన భూమిలో నిర్మాణ అనుమతి కోసం రూ.25,82,254 (ఇరవైఐదులక్షల ఎనభైరెండువేల రెండు వందల యాభైనాలుగు రూపాయాలు) రూసుం వసులు చేశారు.

అనుమతుల జారీపై అనుమానాలు

ఎంతో ప్రతిష్టాత్మకమైన సంస్థగా చెప్పుకునే హెచ్‌ఎండీఏ సేకరించిన భూమికి ఆ సంస్థ అధికారులే అనుమతులు జారీ చేయడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇది ఔటర్ రింగ్‌రోడ్డు, జంక్షన్ కోసం సేకరించిన భూమి అని ఇందులో ఎలా నిర్మాణాలు చేపట్టొద్దని 2022 జనవరిలో ఇక్కడ ఆస్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను హెచ్‌ఎండీఏ అధికారులు కూల్చి వేశారు. కానీ అదే సంస్థ ప్రధాన అధికారులు గతంలో కూల్చివేసిన స్థలంలో నిర్మాణాల కోసం తిరిగి ఆగమేఘాల మీద అనుమతి జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ గజం స్థలం రూ. లక్షకు పైగా ధర పలుకుతోంది. ఈలాంటి విలువైన హెచ్‌ఎండీఏ స్థలంలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం వెనుక గత ప్రభుత్వ పెద్దల హస్తం ఉందనే అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

దోస్త్‌కు సర్వీసు

ఘట్ కేసర్‌లోని ఔటర్‌జంక్షన్ కోసం సేకరించిన భూముల్లో నేటికీ అనేక మంది ఆ స్థలాన్ని ఖాళీ చేయలేదు. అసంపూర్తిగా ఉన్నఔటర్ జంక్షన్‌పై 2024 జనవరి 11న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'దోస్త్‌కుసర్వీసు' కథనంతో ఉలిక్కిపడ్డ హెచ్‌ఎండీఏ అధికారులు రంగంలోకి దిగి యుద్ధప్రాతిపాదికన సర్వే నిర్వహించి హద్దురాళ్ల ఏర్పాటు చేశారు. ఇందులో హెచ్‌ఎండీఏ అధికారులు అనుమతి జారీ చేసిన నిర్మాణంలోనూ ఈ స్థలం ఉన్నట్లు ఆశాఖ అధికారులు ఏర్పాటు చేసిన హద్దులు సూచిస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు ఏమి చేస్తారో వేచిచూడాలి

అసలు విషయం..

ఘట్‌కేసర్ రెవెన్యూలోని సర్వేనెంబర్ 581లో ఔటర్ రింగ్‌రోడ్డు, జంక్షన్ నిర్మాణం కోసం 15 గుంటల భూమిని సేకరించారు. దీనికి సంబంధించి నోటిపికేషన్ జారీ చేయడంతోపాటు 3ఏ, 3డీ ఫైనల్ నోటిఫికేషన్ సైతం పూర్తి అయ్యింది. 2009వసంవత్సరం జనరల్ అవార్డునూ జారీ చేశారు. ఎల్‌ఏ/యూనిట్ 4/ 43--1/2005 అనంతర కాలంలో హెచ్‌ఎండీఏ కమిషనర్ ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని డీపీఎల్‌ఆర్ /25/ఎల్‌ఏ/ ఓఆర్‌ఆర్ /4, 2017 తేదీ 1-10-2018 ఉత్తర్వుల ద్వారా అప్పటి జిల్లా కలెక్టర్‌కు సూచించారు. అంతకు ముందు సైతం 2017లో రికార్డులను సవరించాలని తహసీల్దార్‌తో పాటు కలెక్టర్‌కు నివేదించారు. అయినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఔటర్ భూముల్లో యథేచ్ఛగా క్రయవిక్రయాలు జరుగుతున్నా పట్టించుకనే నాథుడే కరువయ్యాడు. ఔటర్ భూసేకరణ పూర్తయి 15 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కోట్ల రూపాయల విలువైన భూములు పరాధీనంలోనే ఉన్నాయి.

ఆయా శాఖల అధికారుల వైఫల్యం

2005లో ఔటర్ రింగ్‌రోడ్డు, జంక్షన్ కోసం హెచ్‌ఎండీఏ సేకరించిన భూమిని స్వాధీన పర్చుకోవడంలో భూసేకరణ అధికారులు. అప్పటి సంబంధిత శాఖ మంత్రి ఒత్తిడితోనే పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. ఇట్టి భూమిని నిషేధిత జాబితాలో పెట్టాల్సిన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సైతం తమకేమీ పట్టనట్లుగా వ్యవరించారు. దీంతో యథేచ్ఛగా ఆ భూమికి సంబంధించి క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఇదీలా ఉండగా ఎంజాయ్‌మెంట్ సర్వేనిర్వహించిన రెవెన్యూ అధికారులు కనీసం రికార్డుల్లో హెచ్‌ఎండీఏ పేరును సైతం నమోదు చేయకపోవడం గమనార్హం. దీంతోపాటు హెచ్‌ఎండీ అధికారులు వారు సేకరించి భూమిని 31అక్టోబరు 2018న(ఫైల్ నెంబర్ హెచ్‌ఎండీఏ ఎల్ 173074/ఎల్‌ఆర్‌ఎస్/జీటీకే/పీఎల్‌జీ/హెచ్‌ఎండీఏ/2015నాడు) ఎల్‌ఆర్‌ఎస్ చేశారు. వీటితో పాటు మున్సిపల్ అధికారులు పరిపాలనా పరమైన అనుమతల జారీ విషయంలోనూ పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అనుమతులివ్వడం విడ్డూరం



ప్రజాప్రయోజనార్థం హెచ్‌ఎండీఏ ఔటర్ రింగ్‌రోడ్డు, జంక్షన్ నిర్మాణం కోసం సేకరించిన స్థలంలో అదే సంస్థ అధికారులు నిర్మాణ అనుమతులు జారీ చేయడం విడ్డూరం. అధికారులు ప్రభుత్వ ఆస్తులను ప్రైవెట్ వ్యక్తులకు కట్టబెట్టడంపై పూర్తి విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైన అధికారులు ప్రభుత్వం స్పందించి ఇచ్చిన అనుమతులను రద్దు చేసి ఔటర్ కోసం సేకరించిన భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలి. - జె. కిషన్, న్యాయవాది

హెచ్‌ఎండీఏ అనుమతితోనే నిర్మాణం



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డిగూడలో భారీ నిర్మాణానికి సంబంధించి హెచ్‌ఎండీఏ అధికారులే నిర్మాణ అనుమతులు జారీ చేశారు. సాంకేతిక అనుమతులన్నీ హెచ్‌ఎండీఏ అధికారులే జారీ చేస్తారు. ఇందులో మున్సిపల్ అధికారులకు ఏమాత్రం సంబంధం లేదు. స్థల పరిశీలనతో పాటు అన్ని రికార్డులను వారే చూస్తారు. - ఎండీ సాబేర్ అలీ కమిషనర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ



అధికారులు టీఎస్‌బీపాస్‌లో అప్‌లోడ్ చేసిన గుడి పక్కన ఖాళీస్థలం

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ప్రజావాణిలో కలెక్టర్ ప్రతీక్ జైన్



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, సెప్టెంబర్ 23 : జిల్లాలో ప్రజావాణి ద్వారా వచ్చే దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కారించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసు చంద్రలతో కలిసి ప్రజల నుంచి 179 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కార దిశగా అధికారులు పనిచేయాలన్నారు. రైతు రుణమాఫీ, భూమి సమస్యలు అధికంగా వస్తున్న క్రమంలో మండల స్థాయిలో పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లాఅధికారులు పాల్గొన్నారు. కాగా ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో దోమ మండలం దాదాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి, తదితరులు ప్రతిభ కనబర్చాడు, ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, జిల్లా సైన్స్ అధికారిని కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, విద్యార్థులు యశ్వంత్‌గౌడ్, శివసాయి, గైడ్ టీచర్లు శాంతకుమార్, రవికుమార్, డీఎస్‌వో విశ్వేశ్వర్ తదితరులు ఉన్నారు.

కళాశాల సరే.. అధ్యాపకులేరీ?

- నాలుగు కోర్సుల్లో 40 మంది విద్యార్థులే
- వారికి పాఠాలు బోధించేవారు కరువు
- ఒక్క లెక్చరర్‌నీ నియమించని విద్యాశాఖ
- బషీరాబాద్ ఇంటర్ కాలేజీలో అడ్మిషన్లు పూర్తి
- దిక్కులేక తాండూరు కళాశాలలో తరగతులు
- ఆందోళనలో విద్యార్థులు.. పట్టని అధికారులు
- సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో దుస్థితి



బషీరాబాద్‌లో జూనియర్ కాలేజీకి కేటాయించిన భవనం

బషీరాబాద్,సెప్టెంబరు 23: స్థానికంగా ఇంటర్ చదువుదామనుకున్న విద్యార్థుల ఆశలు అడియాశలయ్యాయి. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వారి కోసం జూనియర్ కళాశాల ఏర్పాటైనప్పటికీ ఆ సంతోషం లేకుండాపోయింది. పేరుకే కళాశాలను ప్రారంభించి, అడ్మిషన్లు పొందిన తర్వాత విద్యార్థులను క్లాసులకు ఇతర కళాశాలకు పంపిస్తున్నారు. బషీరాబాద్ మండలానికి 2024-25 విద్యాసంవత్సరానికి కొత్తగా జూనియర్ కళాశాల మంజూరైంది. ఆ శాఖ ఉన్నతాధికారులు హడావుడిగా బషీరాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు)లో ఓ భవనాన్ని కేటాయించారు. ఇంటర్మీడియట్ బోర్డు నోడల్ అధికారి శంకర్‌నాయక్, సదరు నూతన కళాశాల ప్రిన్సిపాల్‌తో కలిసి ఈఏడాది జూన్ 4న కళాశాలను ప్రారంభించారు. అడ్మిషన్లను ప్రారంభించి బైపీసీ, ఎంపీసీ, సీఈసీ ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో 40 మంది విద్యార్థులను చేర్చుకున్నారు. నూతన కళాశాలకు ల్యాబ్ మెటీరియల్‌తో పాటు ఫర్నిచర్ కూడా మంజూరైంది. అయితే ఇప్పటి వరకూ ప్రభుత్వం అధ్యాపకులను మాత్రం నియమించలేదు. ప్రస్తుతం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నర్సింహారెడ్డి కొనసాగుతున్నారు. దీంతో కొత్త కళాశాలలో బోధించేందుకు అధ్యాపకులు లేక మండల పరిధిలోని విద్యార్థుల ఉన్నత విద్య కథ మొదటికొచ్చింది. కళాశాలలో చేరిన విద్యార్థుల్లో 30 మంది వరకు బాలికలు ఉన్నట్లు సమాచారం. అధ్యాపకుల ఏర్పాటు విషయమై స్థానిక ప్రజాప్రతినిధులు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం సొంత జిల్లా కావడంతో ఎమ్మెల్యే అధ్యాపకుల నియమకం కోసం డిప్యూటీ సీఎం, ఉన్నతాధికారులను స్వయంగా కలిసి విన్నవించారు. అయినా ఇప్పటికీ అధ్యాపకుల నియామకం జరగకపోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. చేసేదేమీ లేక ఇక్కడా అడ్మిషన్లు పొందిన విద్యార్థులను తాండూరు పట్టణంలోని జూనియర్ కళాశాలకు పంపించి చదువులు చెప్పిస్తున్నారు. సరిహద్దు మండలమైన బషీరాబాద్ ప్రాంతం తాండూరుకు 35 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో బాలికలు సుదూర ప్రాంతాలకు వెళ్లలేక చదువులు మధ్యలో ఆపేస్తున్నారు. ఈక్రమంలో మండల వాసులు ఎన్నో ఏళ్లుగా ఎమ్మెల్యేలు, మంత్రులకు విన్నవించడంతో ఇక్కడ కళాశాల ఏర్పాటైంది. ఫలితంగా మళ్లీ విద్యార్థులు దూర ప్రాంతానికి బస్సుల్లో వెళ్లి చదువుకోలేక బాలికలు చదువులకు దూరమయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం విద్యావంతుల్లో వ్యక్తమవుతోంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



కళాశాలలో అధ్యాపకులు లేని విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. అధ్యాపకులు లేకుంటే బోధన కష్టమని, అడ్మిషన్లు పొందిన 40 మంది విద్యార్థులను తాండూరులోని జూనియర్ కళాశాలకు పంపిస్తున్నాం. అధ్యాపకుల నియామకం జరిగితే స్థానిక కళాశాలలోనే బోధన ప్రారంభించేందుకు వీలు కలుగుతుంది. - నర్సింహారెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, బషీరాబాద్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలకు పెండింగ్ వేతనాలివ్వాలి

వికారాబాద్, సెప్టెంబరు 23: మినీ అంగన్‌వాడీలకు నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మహిపాల్, ఉపాధ్యక్షులు చంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద వర్కర్లు ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీలను ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలివ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల యూనియన్ జిల్లా కార్యదర్శి భారతి పాల్గొన్నారు.

అయ్యో.. దేవమ్మా!

- గూడు లేక.. ఆదరించేవారు కరువు
- ఏడాదిన్నర కాలంగా పాఠశాల వరండాలో జీవనం
- మతిస్థిమితం సరిగా లేని కొడుకును సాకుతూ బతుకు పోరాటం
- మైల్వార్‌లో తల్లి, తనయుడి దయనీయ పరిస్థితి

7



మైల్వార్ పాఠశాల వరండాలో ఉంటున్న వృద్ధురాలు దేవమ్మ



సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

ఆర్థికాభివృద్ధికి ఉత్పత్తి శక్తుల ఆదాయం పెంచాలి

మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్

మహేశ్వరం, సెప్టెంబరు 23 : భారత ఆర్థిక వ్యవస్థ మరింత అభివృద్ధి చెందాలంటే ఉత్పత్తి శక్తుల ఆదాయాన్ని పెంచాలని, కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలు దేశ ఆర్థిక విధానానికి గొడ్డలి పెట్టు లాంటివని మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి.దత్తునాయక్ అధ్యక్షతన తుక్కుగూడలో సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వర్ మాట్లాడుతూ ఏఐటీయూసీ లాభాలకు ఏనాడూ వ్యతిరేకం కాదని, కార్మికుల కొనుగోలు శక్తి పెంచకుండా ఆర్థిక పురోగతి సాధించడం కష్టమన్నారు. పరిశ్రమలు ఉత్పత్తులను పెంచడం ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించలేమని, ప్రజలు, కార్మికులలో కొనుగోలు శక్తి లేకపోతే పారిశ్రామిక ఉత్పత్తులను ఎవరు కొనుక్కోవాలని అన్నారు. ఏఐటీయూసీ ఏర్పడినప్పటి నుంచి కార్మికుల హక్కుల కోసం, కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు చేస్తూనే ఉందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కేవలం పెట్టుబడిదారులకు మాత్రమే ఆర్థిక లాభాలు చేకూరుస్తున్నాయని, కార్మికులను పట్టించుకోవడం లేదని అన్నారు. పెట్టుబడిదారులకు రాయితీలు ఇచ్చే ప్రభుత్వాలు.. పేదలకు, కార్మికులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు బాలరాజు, యూసుఫ్, జంగయ్య, రవీంద్ర, నర్సింహ, సీతారామయ్య, రత్నాకర్‌రావు, పావని, దేవేందర్‌రెడ్డి, రామస్వామి, జైపాల్‌రెడ్డి, సత్యనారాయణ, చంద్రయాదవ్, శేఖర్‌రెడ్డి, హరిసింగ్‌నాయక్, మల్లేష్, వెంకన్న, దేవేందర్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి అభివృద్ధికి సహకరిస్తా


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాజేందర్

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 23 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం అందిస్తానని మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం కౌన్సిల్ సమావేశానికి ఎంపీ, ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ.. గుండ్లపోచంపల్లి మరింత అభివృద్ధి సాధించాలన్నారు. ఇక్కడ మల్టీస్టోర్ బిల్డింగ్‌లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు భారీగానే ఉన్నాయని, తద్వారా మున్సిపాలిటీకి ఆదాయం బాగానే సమకూరుతుందన్నారు. ఈ నిధులతో అభివృద్ధి చేయాలన్నారు. ఎంపీ కోట నుంచి కూడా నిధులిస్తానని తెలిపారు. తన నివాసం సైతం ఇదే మున్సిపాలిటీ పరిధిలో ఉన్నట్టు ఎంపీ చెప్పారు. సమస్యలపై ప్రజాప్రతినిధులు ఏ సమయంలోనైన తన ఇంటి తలుపు తట్టొచ్చన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి మంచి భవిష్యత్తు ఉందన్నారు. గతంలోనే పెద్దఎత్తున నిధులు కేటాయించామన్నారు. అభివృద్ధికి కౌన్సిల్ మరింత కృషిచేయాలన్నారు. 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి ఓఆర్ఆర్ వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు వెడల్పు చేసి రోడ్డు డివైడర్‌కు ఎంపీ నిధులివ్వాలని ఎమ్మెల్యే, కౌన్సిలర్లు ఈటలకు వినతిపత్రం ఇచ్చారు. చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ ఎ.స్వామి, కౌన్సిలర్లు మల్లికార్జున్, ఎ.సరస్వతి, బాల్‌రాజ్, జైపాల్ రెడ్డి, హేమంత్‌రెడ్డి, పెంటయ్య, సాయిపేట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

కీసర రూరల్: వరద బాధితుల సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ రాజేందర్ హామీ ఇచ్చారు. నాగారం మున్సిపాలిటీలోని బీఎంఆర్, ఎస్ఎల్ఎన్ కాలనీల్లో సోమవారం పర్యటించారు. వరద, బురదలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూశారు. నీరు నిలిచేందుకు గల కారణాలను గుర్తించాలని, తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. వరద నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన నిర్మాణాలు చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఆయనతో మున్సిపల్ చైర్మన్ కె.చంద్రారెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కిషోర్‌గౌడ్, డీఈఈ సుదర్శనంరఘు ఉన్నారు.

వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి

చేవెళ్ల ఏరియా ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే యాదయ్య


రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, సెప్టెంబరు 23 : వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ఆదేశించారు. సోమవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కలియతిరిగి రోగులతో మాట్లాడి వైద్యసేవలు, సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. రెగ్యులర్‌గా విధులకు డుమ్మాకొట్టిన వైద్యులు, సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆసుపత్రుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. మండల సీనియర్ నాయకుడు ఎం.కృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధం అప్రజాస్వామికం : ఆనంద్


మాజీ ఎమ్మెల్యే ఆనంద్ నివాసం వద్ద ఉన్న పోలీసులు

వికారాబాద్, సెప్టెంబరు 23: నిర్బంధం అనేది అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. పేదల ఆరోగ్య పరిస్థితి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న సేవలపై బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీలో ఆయన సభ్యుడు. మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ టీ.రాజయ్య, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఆనంద్‌లతో కలిసి బీఆర్ఎస్ కమిటీని వేసింది. సోమవారం వారు గాంధీ ఆస్పత్రి సందర్శన పెట్టుకున్నారు. దీంతో ఆనంద్ వికారాబాద్ నుంచి వెళ్లకుండా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే నివాసానికి చేరుకొని ప్రజా సమస్యలపై వెళ్తున్న నాయకుడిని హౌస్ అరెస్ట్ చేయడం ఏంటని మండిపడ్డారు. అయితే ఆనంద్ ఉదయం పోలీసుల కల్లుగప్పి హైదరాబాద్ వెళ్లారు. నగరంలోని గాంధీ ఆస్పత్రి వద్ద నుంచి పోలీసులు ఆయనున్న స్టేషన్‌కు తరలించారు. తమను దేశద్రోహులుగా, నక్సలైట్లుగా, గుండాలుగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇది దుర్మార్గ పాలన అన్నారు. వికారాబాద్‌లో ఎమ్మెల్యే నివాసానికి నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, గోపాల్, మేక చంద్రశేఖర్‌రెడ్డి, షఫీ వచ్చి నిరసన తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే కేసులు తప్పవు



చేవెళ్ల, సెప్టెంబరు 23 : వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే కేసులు తప్పవని రిటైర్ జడ్జి సాంబశివుడు అన్నారు. సోమవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌ను చేవెళ్ల మున్సిఫ్ కోర్టు ఆవరణలో నిర్వహించారు. మొత్తం 128 కేసులను పరిష్కరించడంతో పాటు జరిమానా రూ.3,41,000లక్షలు విధించారు. చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపులను వాడుకలోకి తేవాలి


మాట్లాడుతున్న ఎస్ఈ ఆంజనేయులు

చేవెళ్ల, సెప్టెంబరు 23 : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న చేతిపంపులను వాడుకలోకి తీసుకువచ్చే బాధ్యత వాటర్‌మెన్‌లదేనని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఆంజనేయులు తెలిపారు. సోమవారం చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నీటి సరఫరా చేసే నీటి సహాయకులకు నాలుగు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఎస్ఈ ఆంజనేయులు, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యలు కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పైపుల లీకేజీలు, సింగిల్, త్రీఫేజ్ మోటర్ల స్టాటర్లు రిపేరు చేయడంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ తరగతులు చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ మండలాల్లోని అన్ని గ్రామాల సిబ్బందికి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈఈ రాజేశ్వర్, డీఈ హరిక, ఎంపీడీవో హిమబిందు, ఏఈ గీతస్రవంతి,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


వెల్జాల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో శాంతిరేఖ

తలకొండపల్లి, సెప్టెంబరు 23: పోషకాలతో కూడిన ఆహారం సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీవో శాంతిరేఖ అన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, కిశోర బాలికలు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. తలకొండపల్లి మండలం వెల్జాల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారాలతో కూడిన ఆహారాల ప్రదర్శన నిర్వహించారు. పోషక విలువల గురించి స్థానికులకు అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీవో రఘు, సూపర్‌వైజర్ తిరుమల, డాక్టర్ సైదమ్మ, కార్యదర్శి శరత్, టీచర్లు నస్రీన్ బేగం, వసంత లక్ష్మి, భూషణమ్మ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయించండి


రాంరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాచారం, సెప్టెంబరు 23 : మండలంలోని గుంతలు పడిన వివిధ గ్రామాల రోడ్లను బాగు చేయించాలని, చాలా వరకు రోడ్లు పాడైపోయాయని యాచారం మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణయాదవ్, సుధీర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డికి వివరించారు. సోమవారం నగరంలోని రాంరెడ్డి నివాసంలో ఆయన్ను కలిసి సత్కరించారు. పాడైన ఆర్అండ్‌బీ రోడ్ల దుస్థితిని రాంరెడ్డికి వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణమే బాగు చేయించాలని కోరారు. మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం మండల కేంద్రం వరకు సాగుతున్న పనులు ఏడాదిన్నరగా అసంపూర్తిగా ఉన్నాయని రాంరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. త్వరలో ఉన్నతాధికారులతో మాట్లాడి రోడ్లన్నీ బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని రాంరెడ్డి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. రవీందర్, వెంకటేష్ తదితరులు చైర్మన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎంపీ డీకే.అరుణ

కొడంగల్, సెప్టెంబరు 23: క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ అన్నారు. సోమవారం మండలంలోని అన్నారంలో పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. బూత్‌స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలకు పార్టీని పటిష్ఠం చేసేందుకు కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పూనంచంద్ లాహోటీ, బస్వరాజ్, బంటు రమేశ్, ప్రతాప్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న రత్నం

పరిగి, సెప్టెంబరు 23: ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రత్నం అన్నారు. సోమవారం పరిగిలో జరిగిన ఫెడరేషన్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందన్నారు. సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ పోరాటాలు చేస్తోందన్నారు. సమావేశంలో ఫెడరేషన్ కార్యదర్శి ఎ.రాములు, కె.వెంకటయ్య, బుచ్చయ్య, ముత్యప్ప, గంగాధర్, రమేశ్, పాండురంగం, లక్ష్మణ్, మెఘ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నేవీ రాడార్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలి



నేవీ రాడార్‌పై దాదాపూర్‌లో నిరసన తెలుపుతున్న యువకులు

దోమ, సెప్టెంబరు 23: పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన నౌకాదళ రాడార్ స్టేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, సోమవారం దోమ మండలం దాదాపూర్‌లో యువకులు నిరసన తెలిపారు. భూ విస్తీర్ణంలో కనీసం 33శాతం అటవీ ప్రాంతాలుండాలన్నారు. అయితే రాడార్‌తో చెట్లన్నీ నరికివేతకు గురవుతాయని, ఇక్కడ వాతావరణ సమతుల్యం దెబ్బతింటుందన్నారు. గ్లోబల్ వార్మింగ్‌కు దారితీసే కార్యక్రమాలను ప్రభుత్వాలు విరమించుకోవాలన్నారు. దామగుండం అటవీ ప్రాంత పరిరక్షణకు ప్రజలంతా కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యు.కృష్ణ, గురుచరణ్‌గౌడ్, సిద్ధేశ్వర్, ఆంజనేయులు, వెంకటయ్య, పి.శ్రీనివాస్, డి.చెన్నయ్య, వెంగళ్రావు, చెన్నయ్య పాల్గొన్నారు.

పోలీసులు పనితీరును మెరుగుపర్చుకోవాలి



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణ

దౌల్తాబాద్, సెప్టెంబరు 23: పోలీసు సిబ్బంది తమ పనితీరును ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ కేసులపై అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలు, ఆత్మహత్యలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డయల్ 100కు వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఎస్పీతో పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్ ఉన్నారు.

రాజీయే రాజమార్గం : ఎస్పీ



జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 23: కేసుల్లో రాజీ కుదుర్చుకునేందుకు ఈ నెల 28న జిల్లాకోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహిస్తామని ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం తెలిపారు. కక్షిదారులు ఎవరైనా తమ కేసుల రాజీకి లోక్ అదాలత్‌కు వచ్చి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లలో కేసులున్నవారు రాజీ కావాలనుకుంటే స్థానిక పోలీస్టేషన్లో సంప్రదించాలని ఎస్పీ సూచించారు. రాజీ మార్గమే రాచమార్గం అని సూచించారు.

విద్యార్థినులకు ఏఐపై ఉచిత శిక్షణ

లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, డెల్ టెక్నాలజీ సహకారం



సర్టిఫికెట్లు ప్రధానం చేస్తున్న ప్రొఫెసర్ రంజిత్ తదితరులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుకునే విద్యార్థినులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, డెల్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించాయి. హైదరాబాద్, రంగారెడ్డి, తాండూరు జిల్లాల్లోని 25 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 250 మందికి ఏఐ (డాటా ఎనలిటిక్స్, పవర్‌బీఐ, సాఫ్ట్‌స్కిల్స్)పై శిక్షణ అందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ప్రొఫెసర్ రంజిత్, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి అకడమిక్ గైడెన్స్ అధికారి బాల భాస్కర్‌లు సోమవారం సర్టిఫికెట్లు అందించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



పరిసరాలను శుభ్రం చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్రవంతి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 23: పారిశుధ్యం విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్‌పర్సన్ కప్పరి స్రవంతి కోరారు. ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించి ఆసుపత్రి ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుందని ఆమె అన్నారు. అనంతరం మార్కెట్ యార్డులో స్వచ్ఛత కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ బర్ల మంగ, వైద్య బృందం, ఎన్ఎస్‌జీ కమాండోలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ఆవరణంతా మురికి కంపు!



ఆర్టీసీ డిపో ఆవరణలో చేరిన మురుగు నీరు



మురుగు నీటిలో పొర్లాడుతున్న పందులు

- పారుతున్న డ్రైనేజీ నీరు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- దుర్వాసనతో ప్రయాణికులు, సిబ్బంది ఇబ్బందులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 23: మేడ్చల్‌లోని ఆర్టీసీ డిపో పరిసరాల్లో పారుతున్న మురుగు నీటితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల మురుగంతా డిపో పరిసరాల్లోకి చేరుతోంది. దుర్వాసనతో ప్రయాణికులు ముఖానికి గుడ్డచుట్టుకొని నిరీక్షిస్తున్నారు. రెండు రోజులుగా డిపో ఆవరణలో భారీగా చేరుతున్న మురుగుతో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ సిబ్బంది స్పందించడం లేదు. అసలు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి మురుగునీటి పైప్‌లైన్లు, డ్రెయిన్లు ఎలా వేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై తాము మున్సిపల్ అధికారులు, సిబ్బందికి తెలియజేశామని ఆర్టీసీ అధికారులంటున్నారు.

అయ్యో.. దేవమ్మా

- గూడు లేదు.. ఆదరించేవారూ కరువే
- ఏడాదిన్నర కాలంగా పాఠశాల వరండాలో జీవనం
- మతిస్థిమితం లేని కొడుకుతో వృద్ధురాలి బతుకు పోరాటం
- మైల్వార్‌లో తల్లి, తనయుల దీనస్థితి



పాఠశాల వరండాలో ఉంటున్న వృద్ధురాలు దేవమ్మ

బషీరాబాద్, సెప్టెంబరు 23: నిలువ నీడ లేదు.. కడుపు నిండా తిండీ కరువే .. ఆదరించేవారెరూ లేకపోవడంతో ఓ వృద్ధురాలు.. తన కొడుకుతో కలిసి దుర్భర జీవితం గడుపుతోంది. తల్లి, కొడుకు ఓ పాఠశాల వరండా ఆవాసంగా మార్చుకుని దిక్కులేని అనాథలుగా బతుకునీడుస్తున్నారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజన సమయంలో దయతలచి ఎవరైనా బుక్కెడు అన్నం పెడితే అదే తింటూ కాలం వెల్లదీస్తున్నారు. బషీరాబాద్ మండలం మైల్వార్‌కు చెందిన గార్లన్ దేవమ్మ(72) భర్త కొన్నేళ్ల కిందట చనిపోయాడు. ఓ కూతురు ఉండగా పెళ్లిచేసి పంపించింది. వారికి కొడుకు భీంశంకర్(30) ఉన్నాడు. మూడేళ్ల కిందట పెళ్లి చేయగా, అతడితో భార్య కాపురం చేయక కొడుకుతో పుట్టింటికి పోయిందని వృద్ధురాలు తెలిపింది. ఈ నిరుపేద కుటుంబానికి ఉన్న ఇల్లు కూడా శిథిలావస్థకు చేరడంతో కొత్త కష్టాలు వచ్చాయి. చేసేదేమి లేక ఊరిలోని మజీద్, అంగన్‌వాడీ భవనం, పాఠశాల ఆవరణల్లో తల్లీ, కొడుకు తలదాచుకుంటూ కాలం గడుపుతున్నారు. ఏడాదిన్నర కాలంగా ప్రాథమిక పాఠశాల వరండాలో తల్లి, కొడుకు ఉంటున్నారు. కాగా భీంశంకర్ మతిస్థిమితం సరిగా లేక ఎక్కడెక్కడో తిరిగి వస్తాడని, ఉండేందుకు గూడు, తిండి లేక నరకం అనుభవిస్తున్నామని దేవమ్మ రోదిస్తోంది. ఆమెకు ఆసరా పింఛన్ వస్తుడటంతో తల్లీకొడుకు బిస్కెట్లు, బ్రెడ్‌లు కొనుక్కొని తింటూ బతుకీడుస్తున్నారు. డబ్బులు అయిపోతే పస్తులుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ తల్లీ, కొడుకు దయనీయ పరిస్థితిపై స్పందించి ఓ ఇల్లు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సంగయ్యలొంక ఆలయానికి 800ఏళ్ల చరిత్ర



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు సదానందారెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 23: మదన్‌పల్లిలోని సంగయ్యలొంక ఆలయానికి 800ఏళ్ల చరిత్ర ఉందని, కొందరు ఆలయ మాన్యంలోకి వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర నాయకుడు సదానందారెడ్డి అన్నారు. సోమవారం ఆలయ ఆవరణలో గ్రామస్థులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ స్థలాలను సంగమేశ్వరుడి బండలు అంటారని, ఇప్పుడు కొందరు రోడ్డు తవ్వేస్తూ భక్తులను రానివ్వడం లేదన్నారు. రికార్డు ప్రకారం కూడా సంగయ్యలొంక స్థలం అనే ఉందన్నారు. ఇది ప్రైవేట్ స్థలం కాదన్నారు. ఆలయ భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. పచ్చని ప్రకృతితో విరాజిల్లుతున్న దేవాలయం ఆవరణను పర్యాటకంగానూ అభివృద్ధి చేయొచ్చన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని ఆలయ భూమిని, ఆలయాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాములు, సోమిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంచందర్, రమేష్, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సిరియాలు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.



శంషాబాద్‌రూరల్ : కమిషనర్‌కు రికార్డులు అందిస్తున్న కార్యదర్శులు



మహేశ్వరం : కమిషనర్‌కు రికార్డులను అందిస్తున్న శైలజారెడ్డి

మున్సిపాలిటీకి విలీన గ్రామాల రికార్డులు అందజేత

శంషాబాద్ రూరల్/మహేశ్వరం, సెప్టెంబరు 23: ఇటీవల ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేసిన గ్రామాల రికార్డులను పంచాయతీ కార్యదర్శులు అందించారు. సోమవారం శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావును కలిసి మండలంలోని విలీనమైన గ్రామాల రికార్డులను కార్యదర్శులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు. అదేవిధంగా ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని గ్రామ పంచాయతీలను సమీపంలోని మున్సిపాలిటీలో విలీనం చేయడంతో మహేశ్వరం మండలంలోని హర్షగూడను తుక్కుగూడ మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఈమేరకు సోమవారం పంచాయితీ అధికారులు మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో తుక్కుగూడ మున్సిపాలిటీ అధికారులకు హర్షగూడ పంచాయితీ రికార్డులను అప్పగించారు.

సనాతనధర్మ పరిరక్షణకు పాటుపడాలి



చిలుకూరు బాలాజీ ఆలయంలో బీజేపీ నాయకురాలు మాధవిలత, తదితరులు

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 23: ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో సనాతనధర్మ పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా పాటుపడాల్సిన అవసరముందని బీజేపీ నాయకురాలు మాధవిలత పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామిని ఆమె దర్శించుకున్నారు. మాధవిలత మాట్లాడుతూ తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన చిలుకూరు బాలాజీని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ ఘటన సిగ్గు చేటని, జగన్ ప్రభుత్వ హయాంలో ఇతర మతాల వారిని టీటీడీ బోర్డు సభ్యులుగా, ఆలయ సిబ్బందిగా నియమించడమే ఇలాంటి అనర్థాలకు కారణమని ఆరోపించారు. ఏబీవీపీ నాయకులు రాకేష్ యాదవ్, షాపురం శ్రీకాంత్, హిమాయత్‌నగర్ బాబునాయక్, బీజేపీ నాయకులు ఉన్నారు.

ఏపీ మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కేశంపేట, సెప్టెంబరు 23: తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలవడం ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ దిష్టిబొమ్మను సోమవారం కేశంపేట మండల కేంద్రంలో బీజేపీ నాయకులు దహనం చేశారు. కేశంపేట మండలాధ్యక్షుడు రొల్లు రఘురాములుగౌడ్ ఆధ్వర్యంలో జగన్‌మోహన్‌రెడ్డి దిష్టి బొమ్మను తయారు చేసి శవయాత్ర నిర్వహించారు. జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేడ్కర్ చౌరస్తా వరకు శవయాత్ర చేపట్టి నిప్పంటించారు. జగన్‌పై చర్యలు తీసుకోవాలని కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. జిల్లా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మోటే శ్రీనివాస్, యువమోర్చా అధ్యక్షుడు పాలాది శ్రీనివాస్, నాయకులు శేఖర్, తట్టేపల్లి నర్సింహ, బండ వెంకటేష్, కిష్టయ్య, శివ, అనేమోని పారేశ, పోచమోని నవీన్, రమేష్, యాదగిరి, జైపాల్ రెడ్డి, శ్రీకాంత్, సాయి, రాములు, యాదగిరి పాల్గొన్నారు.

అపూర్వ కలయిక.. ఆనందాల వెల్లువ

60 ఏళ్ల తర్వాత కలుసుకున్న బాల్యమిత్రులు



సమ్మేళనంలో అరవై ఏళ్ల నాటి బాల్యమిత్రులు

ఆమనగల్లు, సెప్టెంబరు 23: బాల్యం మరువలేని జ్ఞాపకం.. ఏ స్థాయిలో ఉన్నా చిన్ననాటి మిత్రులు కనిపిస్తే తెలియకుండానే చిన్నపిల్లలు అయిపోతారు. బాల్యంలో చేసిన చిలిపి చేష్టలు, ఆడుకున్న బొమ్మలాటలు, అల్లరిపనులు తలుచుకుంటూ ఆనందంలో మునిగి తేలుతారు. ఆరు దశాబ్దాల తర్వాత కలుసుకున్న ఆ మహిళల్లో అలాంటి జ్ఞాపకాలే కన్పించాయి. ఆనందాల నవ్వులే వెల్లివిరిసాయి. ఆమనగల్లు పట్టణంలోని చిల్వేరు అండాలు నివాస గృహంలో సోమవారం వారంతా ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. మాడ్గుల మండలం గిరికొత్తపల్లికి చెందిన బాల్యమిత్రులు పున్న పద్మమ్మ, చిల్వేరు అండాలు, ఈడెం మంగమ్మ, ఆరుగొండ లక్ష్మమ్మ, ఇట్టె నారాయణమ్మ, కటికె యాదమ్మ, ఇట్టె పుష్పనీల, పాపమ్మ, కృష్ణమ్మ, పెంటమ్మ, రామకృష్ణ, మధులు కలుసుకున్నారు. దాదాపు 60 ఏళ్ల తర్వాత కలిసిన వారు బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆత్మీయ ఆలింగనాలు, పలకరింపులు, ఆట పాటలతో అలరించారు. అపూర్వ క్షణాలను ఆ వృద్ధ వయస్సులో తమ తమ చరవాణిలలో బంధించారు. అనంతరం ఆత్మీయ విందు ఆరగించారు.

వీధి కుక్కల జనన నియంత్రణకు చర్యలు



పట్టుకొచ్చిన కుక్కలను పరిశీలిస్తున్న ఛైర్మన్ ఎం.అశోక్

పరిగి, సెప్టెంబరు 23: మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల జనన నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని మునిసిపల్ ఛైర్మన్ ఎం.అశోక్ తెలిపారు. సోమవారం జంతుజనన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించారు. పట్టుకొచ్చిన కుక్కలను పరిశీలించారు. రెండు, మూడు రోజుల్లో పరిగిలోని అన్ని కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్లను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే 472 కుక్కలను గుర్తించామని చెప్పారు. ప్రజలు, పశువులను కుక్కల బెడద ఉంచి రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరిగిలో కుక్కల సంతానోత్పత్తి నియంత్రణ కేంద్రం నిరంతరం పనిచేస్తుందన్నారు. సంతానం కలగకుండా చికిత్స చేసి, రేబిస్ టీకాలు కూడా వేయిస్తామని తెలిపారు. పెంపుడు కుక్కలకు కూడా ఇక్కడ శస్త్రచికిత్సలు చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్ వారాల రవీంద్ర, మల్లేశ్, తాహెర్‌అలీ పాల్గొన్నారు.



చక్రంపల్లికి బస్సు రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

స్పీకర్ చొరవతో బస్సు సౌకర్యం

మోమిన్‌పేట్, సెప్టెంబరు 23: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవతో హైదరాబాద్ నుంచి పంచలింగాల వయా చక్రంపల్లి బస్సు సర్వీసు ప్రారంభమైంది. దీంతో సోమవారం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి వచ్చిన బస్సుకు పూజలు నిర్వహించారు. గ్రామస్థులు మాట్లాడుతూ తాము ఇకపై ఆటోలు, వ్యక్తిగత వాహనాలపై వెళ్లడం తప్పుతుందన్నారు. రైతులు పండ్లు, కూరగాయలను హైదరాబాద్ మార్కెట్‌కు తరలించేందుకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విక్రంరెడ్డి, గ్రామస్థులు బాల్‌రెడ్డి, ప్రవీణ్, నాగయ్య, నర్సింహారెడ్డి, వీరమల్లాగౌడ్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఫరీద్ పాల్గొన్నారు.

గ్రామీణులకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి



మిషన్ భగీరథ శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఈ విజయశ్రీ

శామీర్‌పేట, సెప్టెంబరు 23: గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన నీటినే సరఫరా చేయాలని మిషన్ భగీరథ శాఖ డీఈఈ విజయశ్రీ అన్నారు. సోమవారం శామీర్‌పేట మండల పరిషత్‌లో మిషన్ భగీరథ కార్పొరేషన్ డీఈఈలు విజయశ్రీ, మహేందర్ శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల నల్‌జల్ మిత్రులకు, పంచాయతీ సిబ్బందికి నాలుగు రోజుల శిక్షణ కార్యాక్రమాన్ని ప్రారంభించారు. డీఈఈలు మాట్లాడుతూ నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పైప్‌లైన్లు ఎక్కడా లీకేజీలు లేకుండా మరమత్తులు, బోరు బావులు, చేతిపంపులు, సింగిల్ ఫేస్, త్రీఫేజ్ మోటార్ల మరమ్మతులు ఎప్పటికప్పుడు చేస్తుండాలన్నారు. రోజువారీ పనులపై వాటర్‌మెన్‌కు శిక్షణిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు మమతాబాయి, వత్సలాదేవి, ఏఈఈలు స్వాతి, సామ్యేల్, అఖిల, శ్రీదేవి, విద్యాసాగర్, పలువురు వాటర్‌మెన్ పాల్గొన్నారు.

మేమెటు పోవాలి?

● ఏఎంసీ చైర్మన్ పదవి ఓసీలకివ్వాలి
● పట్టణ కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి



మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 23 : మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీలకిస్తే జనరల్ కేటగిరీ నేతల బతుకు ఏం కావాలని మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను రిజర్వేషన్ ప్రాతిపదికన నియమించిందన్నారు. దీంతో ప్రతీ వర్గానికి ఓసారి చైర్మన్ పదవి వస్తుందన్నారు. ఈ సారి పదవి జనరల్ కేటగిరీకి వర్తిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ అధిష్టానం జనరల్ కేటగిరీ సీనియర్లకు అవకాశమిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. జనరల్ కేటగిరీ కింద వచ్చే నామినేటేడ్ పదవులను బీసీలకు కేటాయిస్తే పార్టీలోని ఓసీ నేతలను అవమానించినట్టేనని ఆయన అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారిలో అన్ని వర్గాల పార్టీ సీనియర్లు ఉన్నారని, అధిష్టానం ఈ విషయంలో ఆచితూచి ఆలోచించి పదవులు కేటాయించాలని శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



రోడ్డు ఊడుస్తున్న చైర్‌పర్సన్ స్వప్న, మేనేజర్ నరేందర్‌రెడ్డి తదితరులు

తాండూరు, సెప్టెంబరు 23 : పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని తాండూరు పురపాలక సంఘం చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ అన్నారు. సోమవారం పాత తాండూరు 14వ వార్డులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్లు శుభ్రం చేయించారు. స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అక్టోబరు 2 వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు చేపడుతామన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఆటోలకు అందజేయాలన్నారు. పదేళ్లుగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ బొంటిన, శానిటరీ ఇన్‌చార్జి ఇన్స్‌పెక్టర్ వెంకటయ్య, వార్డు ఆఫీసర్ కార్తీక్, జవాన్ వెంకటేష్, ఆర్పీలు కల్యాణి, అపరంజిని, ఎన్వీరాన్‌మెంట్ ఇంజినీర్ ప్రవీణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థులు, కార్మికులతో ర్యాలీ నిర్వహించారు.

కొడంగల్: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా కొడంగల్‌లోని నవీన ఆదర్శ పాఠశాలలో మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరు చెత్త బుట్టల్లో వేసి కంపోస్టు ఎరువు తయారీపై వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఆంజనేయులు, భరత్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్

క్రైం కార్నర్

వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 23 : రోడ్డుదాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన ప్రకారం.. యూపీకి చెందిన రిజ్వాన్ అలీ(22) అవుషాపూర్‌లో ఉంటూ కూలీపనులు చేస్తుంటాడు. సోమవారం ఉదయం రిజ్వాన్ అవుషాపూర్‌లోని తీన్మార్ హోటల్ వద్ద వరంగల్-హైదారాబాద్ రహదారి దాటుతుండగా వాహనం ఢీకొట్టింది. దీంతో అతడి తలకు బలమైన గాయాలయ్యాయి. రిజ్వాన్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.



రిజ్వాన్ అలీ(ఫైల్)

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 23 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌ఘడ్‌కు చెందిన బిహారిలాల్ ఘట్‌కేసర్ అవుషాపూర్ కేపాల్ వద్ద అద్దెకుంటూ కూలీపనులు చేస్తుంటాడు. ఈ నెల 21న అతడి బంధువు సీతులాల్ బరీహ(41) చత్తీస్‌ఘడ్ నుంచి బిహారిలాల్ వద్దకు వచ్చాడు. సీతులాల్ ఆదివారం రాత్రి భోజనం చేసి పడుకున్నాడు. ఉదయానికల్లా చనిపోయాడు. భయంతో ఈ విషయం బిహారీలాల్ ఎవరికీ చెప్పలేదు. సోమవారం ఇంటి యజమానికి చెప్పడంతో అతడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై గాయాలేవీ లేవు. అనారోగ్యం వల్లే సీతులాల్ మృతిచెందాడని ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

బంట్వారం, సెప్టెంబరు 23: మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంట్వారానికి చెందిన పెద్దగొల్ల రమేష్(33) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతడి భార్య వేరొకరితో సంబంధం పెట్టుకోవడంతో రమేష్ మనస్థాపానికి గురై సోమవారం ఉదయం పొలానికని వెళ్లాడు. కూతుళ్లు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో వారు పొలానికి వెళ్లి చూడగా చెట్టుకు ఉరివేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు చేరుకొని మృతదేహానికి మర్పల్లి ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించామని ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. తన కొడుకు ఆత్మహత్యకు కోడలికి ఉన్న వివాహేతర సంబంధమే కారణం అని రమేష్ తల్లి సంగమ్మ ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కారు, రెండు బైక్‌ల ఢీ.. తండ్రీకొడుకులకు గాయాలు

తాండూరు రూరల్, సెప్టెంబరు 23: కారు, రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో తండ్రి, కొడుకు గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం తాండూరులో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోనూరుకు చెందిన నరేందర్ కుమారుడు తుకారాం తాండూరులోని హైదరాబాద్ రోడ్డులో గల బీసీ హాస్టల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. ఆదివారం తండ్రి నరేందర్ కొడుకును స్వగ్రామం తీసుకెళ్లేందుకు వచ్చాడు. బైక్‌పై బయల్దేరారు. పట్టణంలోని ఫ్లైఓవర్‌పైకి రాగానే వెనుక నుంచి వచ్చిన ఓ బైక్ వారిని ఢీకొంది. దీంతో నరేందర్ బైక్ ముందున్న కారును ఢీకొట్టింది. దీంతో తండ్రికొడుకు కిందపడిపోయారు. వారి తలకు, శరీర భాగాలకు తీవ్ర గాలయ్యాయి. స్థానికులు వారిని తాండూరలోఓని జిల్లా ఆసుపత్రికి తరలించారు. నరేందర్‌కు చికిత్స అందించగా, తుకారాంను మెరుగైన చికిత్స కోసం ఎంసీహెచ్ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.



గాయపడిన నరేందర్, తుకారాం

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 9 మందికి జరిమానా

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 23 : డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 1వ మెట్రోపాలిటన్ న్యాయాధికారి 9మందికి జరిమానా, ఓ వ్యక్తికి రెండు రోజుల ట్రాఫిక్ విధుల నిర్వహణ శిక్ష విధించారు. ఘట్‌కేసర్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో రెండు రోజుల్లో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 9మందిపై సీఐ పరశురాం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున జరిమానా, ఒకరికి ట్రాఫిక్ విధులు నిర్వహించాలని తీర్పునిచ్చారు. సోమవారం సదరు వ్యక్తి యంనంపేట చౌరస్తాలో వరంగల్-హైదారాబాద్ రహదారిపై ట్రాఫిక్ విధులు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఈ రకమైన తీర్పులతో వాహనాదారుల్లో మార్పు వస్తుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఇసుక డంప్‌ల ధ్వంసం

ధారూరు, సెప్టెంబరు 23: ధారూరు అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను రేంజర్ రాజేందర్ ధ్వంసం చేయించారు. కోట్‌పల్లి అలుగు, రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో వాగుల్లో నుంచి వచ్చిన ఇసుకను అటవీ ప్రాంతంలో నిల్వ చేసి రాత్రి పూట తరలిస్తున్నారన్నారు. సోమవారం అధికారులు, సిబ్బందితో రేంజర్ అటవీ ప్రాంతంలో తనిఖీలు చేసి ఇసుక డంపులను సిబ్బందితో ధ్వసం చేయించారు. ఇసుక అక్రమ రవాణను అరికట్టేందుకు రాత్రి సిబ్బందితో పెట్రోలింగ్ చేయిస్తామని, అడవిలోకి రాకుండ దారులను మూసివేస్తామని ఆయన చెప్పారు.

చితకబాదిన అత్తింటివారు.. అల్లుడి ఆత్మహత్య

ధారూరు, సెప్టెంబరు 23: గొడవపడి పుట్టింట్లో ఉంటున్న భార్యను తీసుకురావటానికి వెళ్లిన భర్తను భార్య, అత్తింటివారు దూషించి చితకబాదారు. దీంతో మనస్తాపానికి గురైన అల్లుడు గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ధారూరు మండలం మోమిన్‌కుర్దులో సోమవారం చోటుచేసుకుంది. మోమిన్ కుర్దుకు చెందిన రాజు(36)కు హరిదాసుపల్లికి చెందిన లక్ష్మి(32)తో 14ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు. రాజుతో లక్ష్మి తరుచూ గొడవపడి తల్లిగారింటికి వెళ్లగా పెద్దలతో మాట్లాడి కాపురానికి తీసుకొచ్చారు. ఏడునెలల క్రితం తిరిగి గొడవపడి పుట్టింటికి వెళ్లి రాలేదు. ఈ నెల 21న రాజు భార్య లక్ష్మి వద్దకు వెళ్తున్నానని తల్లి వెంకటమ్మకు చెప్పి హరిదాసుపల్లికి వెళ్లాడు. లక్ష్మి కాపురానికి రానంటోందని భార్య, అత్త భాగ్యమ్మ, బావమరిది మల్లేశం కలిసి తనను కొట్టి దూషించారని 22న రాజు తల్లికి ఫోన్ చేసి చెప్పాడు. ధారూరుకు వచ్చిన రాజు మనస్తాపంతో గడ్డిమందు తాగి పోస్టాఫీస్ కార్యాలయం వెనుక అపస్మారకస్థితిలో పడిపోయాడు. వికారాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. రాజు తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.



రాజు మృతదేహం

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



మహేందర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబరు 23: ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి సోమవారం జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి తాండూరు నియోజకవర్గం ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలివెళ్లి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆయనకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీపీ వైస్‌చైర్మన్ రవీందర్ గౌడ్, డీసీసీ మాజీ సభ్యులు పి.నర్సిములు, నాయకులు కరుణం పురుషోత్తంరావు, పరిమళ్‌గుప్తా, వడ్డె శ్రీనివాస్, గాజీపూర్ నారాయణరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్ లాల, మహిపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి ఉన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఒకరికొకరు కేక్ తినిపించుకున్నారు. మహేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పట్టణ కాంగ్రెస్ నాయకులు రఘు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 25 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, నాయకులు రఘు, కౌన్సిలర్ బోయరవి తదితరులు పాల్గొన్నారు.



తాండూరులో రక్తదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల అవస్థలు



కార్యాలయంలో పేరుకున్న దరఖాస్తులు

మర్పల్లి, సెప్టెంబరు 23 : సాంకేతిక లోపం కారణంగా సకాలంలో ఆదాయ సర్టిఫికెట్లు అందక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు ఆదాయ ధ్రువీకరణలు ఎందుకు ఇవ్వడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఈ నెల 1 నుంచి 12వరకు మీ సేవ కేంద్రాల్లో ఆదాయ ఇన్‌కం సర్టిపికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారం రోజుల్లో సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఇవ్వలేదని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. చేసుకున్నా తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో సమస్యల కారణంగా దరఖాస్తులు చూపడం లేదని సిబ్బంది తెలిపారు. సమస్యకు పరిష్కారం ఏంటని సిబ్బందిని ప్రశ్నిస్తే.. 'మాకు సంబంధం లేదు. మీ సేవలోనే కనుక్కోవాలి.' అని చెబుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ సమస్య ఉందని, త్వరలోనే దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు అవుతాయని సిబ్బంది తెలిపారు.

బాల్యవివాహాలు నేరం

ధారూరు, సెప్టెంబరు 23: బాల్య వివాహాలు చేయడం చట్టప్రకారం నేరమని, బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించకూడదని సాధన స్వచ్ఛంద సంస్థ కార్య నిర్వాహకుడు రాహుల్ తెలిపారు. మండల పరిధిలోని కేరెల్లి, ఎబ్బనూర్, హరిదాసుపల్లి, చింతకుంట, అల్లీపూర్ గ్రామాల్లో సోమవారం చైల్డ్ మ్యారేజ్ రిజిష్టర్‌లను అందజేసి స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడ పిల్లలకు 18సంవత్సరాలు, మగ పిల్లలకు 21సంవత్సరాలు నిండిన తర్వాతనే పెళ్లి చేయాలన్నారు. అంతకు ఒక్క రోజు తక్కువ ఉన్నా పెళ్లి చేస్తే నేరం కిందకి వస్తుందన్నారు. బాల్య వివాహాలు చేస్తున్నట్లు సమాచారం ఉంటే తమకు, చైల్డ్‌లైన్, పోలీసులకు సమాచారం ఇవ్వాలనికోరారు. కార్యక్రమంలో సిబ్బంది, స్కూళ్ల టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

రేషనలైజేషన్ నిబంధనలు సరి కాదు

కొడంగల్, సెప్టెంబరు 23: ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఏ ఉపాధ్యాయుడు ఉండాలో నిర్ణయించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంవత్సరాల తరబడి కోరుతూ ఉంటే ప్రభుత్వం అశాస్త్రీయ రేషనలైజేషన్ ఉత్వర్వులను అమలు చేయాలని చూస్తోందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. కొడంగల్‌లోని జడ్పీహెచ్‌ఎస్ హస్నాబాద్‌లో ఎస్టీయూ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. 60 మంది విద్యార్థుల వరకు ఇద్దరే ఉపాధ్యాయులు బోధించాలని పేర్కొనడం అశాస్త్రీయమన్నారు. డీఎస్సీ ఉత్వర్వులు ఇచ్చి పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలన్నారు. కార్యక్రమంలో అంజిలప్ప, గోపాల్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన

తాండూరు రూరల్, సెప్టెంబర్ 23 : జినుగుర్తిలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో విద్యార్థినులకు హెచ్‌ఐవీ/ఎయిడ్స్, ఎస్‌టీఐ/ఎస్‌టీడీలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీసీ కౌన్సిలర్ పర్వతాలు మాట్లాడుతూ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ ఎలా సోకుతుంది, నివారణపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటమ్మ, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్స్ నీలిమ, రేణు, జూనియర్ లెక్చరర్ రాధిక, పీఈటీ మంజుల, టీచర్లు, మేనేజర్ కృష్ణవేణి, ఓఆర్‌డబ్ల్యూఎస్ ప్రకాష్, ఓఆర్‌డబ్ల్యూ అనంతప్ప పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పర్వతాలు



ఉప్పర్‌పల్లిలో గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందిస్తున్న నాయకులు

గ్యాస్ సబ్సిడీ పత్రాల పంపిణీ

కొడంగల్ రూరల్, సెప్టెంబరు. 23: ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద మంజురైన గ్యాస్ సబ్సిడీ మంజూరు పత్రాలను పంచాయతీ కార్యదర్శులు, నాయకులు సోమవారం పంపిణీ చేశారు. పర్సాపూర్‌లో పంచాయతీ కార్యదర్శి కల్పన, మాజీ సర్పంచ్‌లు సయ్యద్ అంజాద్, శ్రీనివాస్‌రెడ్డి పత్రాలను అందించారు. అలాగే ఉప్పరిపల్లి గ్రామంలో మహిళలకు గ్యాస్ సబ్సిడీ మంజూరు పత్రాలను కాంగ్రెస్ నాయకులు ఆనంద్ రెడ్డి, ఉప్పరి తుల్జప్ప, గోపాల్‌రెడ్డి, ఉప్పరి శీను, శ్యాంప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి ప్రజావాణిలో రెవెన్యూ సమస్యలే అధికం



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఉమాశంకర్‌ప్రసాద్

తాండూరు, సెప్టెంబరు 23:ప్రజావాణిలో రెవెన్యూ సమస్యలే అధికంగా వచ్చాయి. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులు స్వీకరించారు. వీటిల్లో రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపాలిటీకి సంబంధించిన సమస్యలపై దరఖాస్తులొచ్చాయి. భూముల సర్వే, పట్టదారు పాస్‌పుస్తకాలు, పట్టా మార్పిడి, మురుగ కాల్వల శుభ్రం, తాగునీటి సమస్య వంటి దరఖాస్తులు వచ్చాయి. వాటిల్లో ఆయా శాఖలకు పంపి పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు. డివిజన్ స్థాయి ప్రజావాణిలో 19 దరఖాస్తులొచ్చాయి. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారి మాణిక్‌రావు, తహసీల్దార్ తారాసింగ్, డీఎల్పీవో శంకర్‌నాయక్, మున్సిపల్‌మేనేజర్ నరేందర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ, తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో టేకులపల్లి, బురుగుపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు రెండు దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు. ప్రజా సమస్యలుంటే ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రజావాణిలో మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. లేదంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర చక్రవర్తి, పశువైద్యాధికారి గీత, ఏపీఎం రాజు, పద్మారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 23 : పెంపెడు జంతువులకు బ్లూక్రాస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వ్యాక్సినేషన్ కొనసాగుతుందన్నారు. ఇళ్లల్లో కుక్కలు, ఇతర పెంపుడు జంతువులను పెంచుకునే వారు ఈ కార్యక్రమంలో తమ జంతువులకు వ్యాక్సినేషన్ చేసుకోవాలని కోరారు.


28న జాతీయ లోక్ అదాలత్

పూడూరు, సెప్టెంబరు 23: ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెన్‌గోముల్ ఎస్‌ఐ మధుసూదనరెడ్డి సోమవారం తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌తో సివిల్, క్రిమినల్ కేసులున్న ఇరు వర్గాలు రాజీ కుదుర్చుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులు పరిష్కరించుకోవచ్చని ఎస్‌ఐ తెలిపారు.

అసైన్డ్ భూమిని పరిశీలించిన డీఎస్పీ

తాండూరు రూరల్, సెప్టెంబరు 23 : సంగెం కలాన్‌లో సర్వే నంబర్ 109 లోని అసైన్డ్ భూమిలో శివారెడ్డి అనే వ్యక్తి తవ్వకాలు చేపట్టి కబ్జా చేశాడని పట్టాదారు తిప్పన్న కొన్ని రోజుల క్రితం ఎస్సీ, ఎస్టీ కమిషన్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. కమిషన్ ఆదేశాలతో సోమవారం డీఎస్పీ బాలకృష్ణారెడ్డి భూమిని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని చెప్పారు.

శిక్షణ పూర్తి చేసిన ఎస్‌ఐకి సన్మానం



ఖాజాపాషాను సన్మానిస్తున్న నాయకులు

వికారాబాద్, సెప్టెంబరు 23 : ఇటీవల ఎస్‌ఐ శిక్షణ పూర్తి చేసుకొని వికారాబాద్ వచ్చిన ఖాజాపాషాను సోమవారం మైనార్టీ నాయకులు సన్మానించారు. ఖాజాపాషా నివాసంలో అతడిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ కో-ఆప్షన్ సభ్యుడు అఫ్జల్, షకీల్, తెలంగాణ రాష్ట్ర హోంగార్డు ఆర్గనైజ్ సెక్రటరీ చాంద్‌పాషా, మైనార్టీ యూత్ జహంగీర్, షఫీ, సిద్దిక్, సద్దాం, రజాక్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



కాలనీ అధ్యక్షుడిని సత్కరిస్తున్న కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్

కీసర రూరల్, సెప్టెంబర్ 23 : నాగారం మున్సిపాలిటీ 14వ వార్డు సంతోష్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హనుమంత్‌రావు, ఉపాధ్యక్షుడు రామ్‌చందర్, ప్రధాన కార్యదర్శి లింగాచారిని ఎన్నుకున్నారు. మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కౌన్సిరల్ శ్రీనివాస్‌గౌడ్ నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. పార్కు ప్రహరీ నిర్మాణానికి రూ.2లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10లు కేటాయిస్తున్నట్లు ఈ సందర్భంగా మన్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి హామీ ఇచ్చారు.

'కబ్జా భూమిని విడిపించాలి'

వికారాబాద్, సెప్టెంబరు 23 : రాజీవ్‌నగర్ కాలనీలో ప్రభుత్వం వీకర్ సెక్షన్ కింద కొనుగోలు చేసి ఇంటి పట్టాలిచ్చిందని, కొందరూ ఆ భూమిని కబ్జాచేశారని, దాన్ని ప్రజలకు అందించాలని కాలనీ వాసులు కోరారు. సోమవారం మునిసిపల్ చైర్ పర్సన్ మంజులరమేష్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కాలనీలో 268, 269 సర్వే నబర్లలో భూమి కబ్జా చేశారన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, మునిసిపల్ అధికారుల ఈ నెల 9న సర్వే చేశారన్నారు. 30గుంటల భూమి కబ్జా చేసినట్టు తేలిందన్నారు. ఆ భూమిలో కొందరు ఇండ్లు కట్టుకున్నారని చెప్పారు. మిగిలిన భూమినైనా పేదలకు పంచాలని కోరారు. అలాగే అంగన్‌వాడీ భవనం కోసం స్థలం కేటాయించాలని వారు కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు ట్యూబ్‌లైట్ల అందజేత

బషీరాబాద్, సెప్టెంబరు 23: ఆయా గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. సోమవారం బషీరాబాద్ మండల పరిషత్‌లో ఎంపీడీవో విజయ్‌కుమార్ అంగన్‌వాడీ టీచర్లకు ఒక్కో ఫ్యాన్, ట్యూబ్‌లైట్‌ను అందించారు. 30 భవనాలకు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు వచ్చాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి తెలిపారు. కార్యాలయ సూపరిటెండెంట్ విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్ శేర్‌ఖాన్, జూనియర్ అసిస్టెంట్ చెన్నయ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 23: మేడ్చల్ పట్టణంలో బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరిగి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా పట్టణంలోని మార్కెట్ దుకాణాల్లో తిరిగి నాయకులు చిరు వ్యాపారులకు పార్టీ సభ్యత్వాలు అందజేశారు. అన్ని వర్గాల ప్రజలు పార్టీలో సభ్యత్వం తీసుకొని పార్టీని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు కోరారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన విశ్వనాథ్‌గౌడ్



తాండూరు, సెప్టెంబర్ 23: తెలంగాణ పీసీసీ నూతన అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను తాండూరు మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.విశ్వనాథ్‌గౌడ్ కలిశారు. సోమవారం హైదరాబాద్‌లో మహేష్‌గౌడ్‌తో విశ్వనాథ్ ఆయన కుమారుడు సోమనాథ్‌గౌడ్ భేటీ అయ్యారు. పీసీసీ అధ్యక్షుడిగా నియామకం, బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శాలువాతో సన్మానించి, పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'హామీలన్నీ అమలు చేస్తాం'

కులకచర్ల,సెప్టెంబరు 23: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. సోమవారం అనంతసాగర్, గోరిగడ్డతండాల్లో గ్యాస్ సబ్సిడీ పత్రాలను పంపిణీ చేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో పత్రాలు పంపిణీ చేశామన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు, కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీఎంపీపీ ఆంజనేయగౌడ్, ఎస్టీసెల్ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, బీసీ సెల్ మహేశ్‌కుమార్, జలీల్, రామచంద్రయ్య ఆనందం, కృష్ణయ్య పాల్గొన్నారు.

సమయస్ఫూర్తితో అగ్నిప్రమాదాల నియంత్రణ

కీసర రూరల్, సెప్టెంబరు 23:సమయస్ఫూర్తితో అగ్ని ప్రమాదాలనూ నియంత్రించొచ్చని చెర్లపల్లి ఫైర్‌స్టేషన్ అధికారి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం నాగారంలోని సెరినిటీ స్కూల్లో ఫైర్ యాక్సిడెంట్లపై నివారణకు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

పీఆర్టీయూ టీఎస్ బషీరాబాద్ మండల అధ్యక్షుడిగా నర్సింహారెడ్డి

బషీరాబాద్, సెప్టెంబరు 23: పీఆర్టీయూటీ ఎస్ బషీరాబాద్ మండల అధ్యక్షుడిగా కె.నర్సింరెడ్డి,ప్రధాన కార్యదర్శిగాఎం.రవీందర్ ఎన్నికయ్యారు. సోమవారం బషీరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాలులో పీఆర్టీయూ సమావేశం నిర్వహించి యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. సభ్యత్వం కలిగిన 187మందిలో 167 మంది టీచర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు. అధ్యక్షుడిగా కె.నర్సింహరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.రవీందర్‌లను ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథులు మాజీ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్, టీచర్లు పలువురు వారిని ఘనంగా సత్కరించారు. కాగా పీఆర్టీయూ యూనియన్ ఎన్నికల నేపథ్యంలో కొందరు టీచర్లు స్కూళ్లను మధ్యాహ్నానికే మూసి వెళ్లినట్లు తెలిసింది. దీనిపై ఎంఈవో సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ ఎవరెవరూ లీవ్ పెట్టారో తెలుసుకుంటామని చెప్పారు.

